సాక్షి పల్నాడు

శనివారం । 26 । అక్టోబర్ । 2024



భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

పొన్నూరు: స్థానిక ఐదో వార్డు డఫ్‌పేట ముస్లిం యూత్ ఆధ్వర్యంలో జెండా చెట్టు వద్ద శుక్రవారం గ్యార్మీ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భారీ ర్యాలీ నిర్వహించారు.



పశుగణన పోస్టర్లు విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: పశుగణనను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శుక్రవారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో పశుగణన పోస్టర్లను విడుదల చేశారు.



తిరుపతమ్మ సన్నిధిలో సందడి

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ సన్నిధిలో శుక్రవారం భక్తజన సందడి అధికంగా ఉంది. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చేసిన కోలాటం ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్ర



రాజుపాలెం: ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాల సంఖ్య పెంచాలని గుంటూరు వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్‌డి) డాక్టర్ సుచిత్ర సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, పిల్లలకు సరైన సమయంలో టీకాలు వేసేలా సిబ్బందికి అవగాహన కల్పించాలని డాక్టర్ రవితేజ నాయక్‌కు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉషారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక పరిష్కార వేదిక

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా నాలుగో శనివారం నిర్వహించే ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక శనివారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షెడ్యూల్డు కులాలు, తెగల ప్రజలు ప్రత్యేక పరిష్కార వేదికను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

రేపు గుంటూరులో రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి 5వ మాస్టర్ స్విమ్మింగ్ పోటీలు ఆదివారం గుంటూరులో నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలలో 25 సంవత్సరాల వయస్సు నుంచి 80 సంవత్సరాల వయస్సు వరకు వివిధ కేటగిరీలలో మహిళలు, పురుషులకు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 8296374963 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

మిర్చి యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ నియమితులయ్యారు. ఈ మేరకు మార్కెటింగ్‌శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శుక్రవారం జీఓ నంబర్ 671 జారీ చేశారు. ఇప్పటి వరకు యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగిన మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు స్థానంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజను నియమిస్తూ జీఓ జారీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో పర్సన్ ఇన్‌చార్జిగా భార్గవ్ తేజ బాధ్యతలు చేపట్టనున్నారు. గుంటూరు మార్కెట్ యార్డుకు చైర్మన్ నియామకం జరిగే వరకు ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

అఖిల భారత పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ

రేపల్లెరూరల్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లను పట్టణంలోని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ రేపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ నాంచారయ్య మాట్లాడుతూ పశుగణన కార్యక్రమాన్ని ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బందికి ఇంటింటికి వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారని పేర్కొన్నారు. పశు యజమానులు సహకరించాలని కోరారు. తద్వారా పశుగణ రంగ పథకాల రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయవచ్చని తెలిపారు. పశుగణన పూర్తి చేసిన ఇళ్లకు సిబ్బంది స్టిక్కర్లు అంటిస్తారని చెప్పారు.

కాలువలో పడి రైతు గల్లంతు

తెనాలిరూరల్: కాలువలో పడి రైతు గల్లంతైన ఘటన తెనాలి మండలం కొలకలూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన 55 ఏళ్ల ఏడుకొండలు పొలానికి మందు కొట్టేందుకు సైకిల్‌పై వెళుతుండగా సైకిల్‌కు తగిలించిన కవరు తెగి కొమ్మమూరు కాలువ గట్టు వెంబడి పడింది. కవరు తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. రూరల్ ఎస్‌ఐ సీహెచ్ ప్రతాప్ ఘటనా స్థలాన్ని పరిశీలించి గాలింపు చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలతో సహవాసం

క్వారీల్లో పనిచేయడం అంటే మృత్యువుతో పోరాటం చేయడమే. ఎప్పుడు ఎటు వైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు. అయినా పొట్ట కూటి కోసం బతుకు పోరాటం చేస్తున్నారు. కానీ డయేరియా రూపంలో మృత్యువు వారిని కబళిస్తోంది. ఇప్పుడు బతకడం కోసం నిజంగానే పోరాటం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో డయేరియా ప్రబలి ఇద్దరు మృతి చెందగా, 14 మంది చికిత్స పొందుతున్నారు.

అంజనాపురంలో కనీస వసతులు కరువు



కాలువలు లేక రోడ్డుపై నిలిచిన మురుగు

- నడిచేందుకు రహదారులు లేవు
- డ్రెయినేజీ వ్యవస్థ లేక నిలిచిన పారుదల
- మురుగులోనే తాగునీటి పైప్‌లైన్‌లు
- మురికికూపంగా కాలనీ
- తరచూ రోగాల బారిన కాలనీ వాసులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

సాక్షి: నరసరావుపేట: పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీస వసతులు కరువయ్యాయి. ప్రజలను తరచూ ఆరోగ్య సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు విషజ్వరాలతో మంచం పట్టిన కాలనీవాసులు ఇప్పుడు డయేరియాతో అనారోగ్యం బారిన పడి అల్లాడుతున్నారు. కాలనీలో 120 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరంతా క్వారీల్లో పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కాలనీలో సరైన రహదారులు లేవు. మురుగు కాలువలు లేవు. దీంతో మురుగు పారుదల లేక ఇళ్ల ముందు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది.

ప్రబలుతున్న డయేరియా

తొలి విడతలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు వ్యక్తులు చనిపోగా..మరో 14మంది చికిత్స పొందుతున్నారు. శుక్రవారం కొత్తగా తిరుపతి గోపి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి పార్వతమ్మ, తిరుపతిరావు, తమ్మిశెట్టి అశోక్, బండారు చిరంజీవి, తమ్మిశెట్టి ఆదిలక్ష్మి, మహంకాళి మల్లేశ్వరి వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది కాలనీలో వైద్య శిబిరాలను కొనసాగిస్తున్నారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రిలోను, మరికొంతమంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గతంలో ఉన్న బోరుకి ఉన్న పైపులైన్‌ని తొలగించి పాత బోరుకి పైపులైన్ కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేశారు. ఈ బోరులోని నీరు కలుషితం కావటంతో ప్రజలు డయేరియా బారిన పడ్డారు.

పారిశుధ్య పనులు

వాంతులు, విరేచనాలతో ప్రజలు మంచాన పడటంతో అంజనాపురం కాలనీలో పారిశుధ్యం పనులు చేపట్టారు. కాలువల్లో పూడికతీత పనులు చేసి బ్లీచింగ్ చల్లారు. దోమలు వ్యాప్తి చెందకుండా రసాయనాలు చల్లారు. జేసీబీతో చెట్లు తొలగించారు. తబోరుని సీజ్ చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

ఇద్దరం డయేరియా బారినపడ్డాం



తాగునీరు కలుషితం కావటం వల్ల మా ఇంట్లో నేను, మా అన్నయ్య వాంతులు, విరేచనాల బారినపడ్డాం. ఇద్దరం ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నాం. చాలా ఖర్చు అయ్యింది. మా ఇంటి ముందు రోడ్డు బురదమయంగా ఉంది. తాగునీటి పైపులైన్లు కూడా బురదలోనే ఉంటున్నాయి.

– దేవళ్ల రాకేష్

అప్రమత్తంగా ఉండాలి



వైద్యులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి

దాచేపల్లి: అతిసార కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురంలో శుక్రవారం ఆమె పర్యటించారు. అతిసార కేసుల వివరాలను, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం అతిసారతో పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉంటే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించాలని సూచించారు. అతిసార కేసులు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ బి.రవి, జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్, డాక్టర్ అమూల్య, మధు, సుల్తానా, ఎంపీహెచ్‌ఈవో పట్టాభి తదితరులున్నారు.

సురక్షిత నీరు అందించాలి



మా కాలనీలో తరచూ రోగాలు వస్తున్నాయి. మేము తాగుతున్న నీరు కలుషితం అయ్యిందని తెలుసుకున్నాం. దయ చేసి మాకు సురక్షిత తాగునీటిని అందించి మా ప్రాణాలను కాపాడాలి. మురికి కాలువలు లేకపోవటం వలన ఇళ్ల ముందే గుంతలు తీశాం. తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.

–తమ్మిశెట్టి పూజిత

మురుగులో తాగునీటి పైపులైన్లు



మా కాలనీలో తాగునీటి పైపులైన్లు మురుగులో ఉన్నాయి. మా వీధిలో సిమెంట్ రోడ్డు లేదు. కాలువలు లేవు. ఎన్నిసార్లు ఈ సమస్యను పరిష్కరించమని చెప్పి ఎవ్వరు పట్టించుకోవటం లేదు.

– బండారు రమణ

దుర్భర జీవితం గడుపుతున్నాం



అంజనాపురం కాలనీలో చాలా దుర్భరమైన జీవితం గడుపుతున్నాం. అడుగుతీసి అడుగు వేసే పరిస్థితి లేదు. రహదారులు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డు వేయమని అడిగితే పట్టించుకోవటంలేదు. సమస్యలతో అల్లాడిపోతున్నాం. మా బాధలు వినేవారు కరువైయ్యారు.

– తమ్మిశెట్టి అంకమ్మ

అభివృద్ధిపై శ్రద్ధ లేదు



ఎన్నికలు వస్తే ఓట్ల కోసం మా ఇళ్ల చుట్టూ తిరుగుతారు. ఓట్లు వేయకముందు మేము రోడ్లు వేస్తాం. తాగునీరు ఇస్తాం. మీ కాలనీని అభివృద్ధి చేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవటం లేదు. మా కాలనీ అభివృద్ధికి నోచుకోవటం లేదు. సురక్షిత నీటిని అందించండి. వాటర్ ట్యాంక్ కట్టించాలి.

– కొడగంటి రాణి

పట్టించుకోవటంలేదు



మా కాలనీలో చాలా మంది రోగాల బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. రెండు నెలల నుంచి టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలతో అల్లాడుతున్నాం. ఇప్పుడు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నాం. సంపాదనంతా ఆస్పత్రులకే ఖర్చు చేస్తున్నాం. వృద్ధాప్యంలో ఉన్న నాలాంటి వాళ్లు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.

– కొమ్ము మేరమ్మ

చిరకాల కల సాకారమయ్యేనా!

- కృష్ణా నదిపై వంతెన నిర్మాణానికి రూ.62 కోట్లు
- నాబార్డు నిధులు మంజూరు చేసిన జగన్ సర్కార్
- జూన్ 2023 జూన్ 12న శిలాఫలకం ఆవిష్కరించిన అప్పటి సీఎం జగన్
- అనువైన ప్రాంతాన్ని గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే శంకరరావు
- టెండర్లు ఖరారు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఎన్నికలు రావడంతో నిలిచిన పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం




వంతెన నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతం

అచ్చంపేట: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై వంతెన నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక. వంతెన నిర్మాణం జరిగితే రెండు జిల్లాల మధ్య వ్యాపార లావాదేవీలు మెరుగు పడటమే కాకుండా హైదరాబాద్ వెళ్లేందుకు వ్యయప్రయాసలు తగ్గుతాయి. పెదకూరపాడు నియోజకవర్గ రూపురేఖలు మారి ఎంతో అభివృద్ధి చెందుతుంది. పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది. నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అందరూ ఆశించారు. ఈ ప్రాంత ప్రజల ఆశలు, కలను సాకారం చేసేందుకు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నదికి ఇరువైపులా ఉన్న అచ్చంపేట సరిహద్దులోని మాదిపాడు, జగ్గయ్యపేట మండల సరిహద్దులోని ముక్త్యాల వరకు కృష్ణా నదిపై వంతెన నిర్మించే ఆలోచన చేశారు. ఈ విషయాన్ని అప్పటి సీఎం జగన్ మోహన్‌రెడ్డితో చర్చించారు. అవసరాన్ని, ఆవశ్యకతను గుర్తించిన జగన్ కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేయించి యుద్ధప్రాతిపదికన నాబార్డు నిధులు రూ.62కోట్లు మంజూరు చేయించారు.

అప్పటి సీఎం జగన్ శిలాఫలకం ఆవిష్కరణ

ప్రజాసేవకు, అభివృద్ధికి ఎప్పుడూ ముందుండే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి జూన్ 12, 2023న పల్నాడు జిల్లా క్రోసూరు వచ్చిన సందర్భంలో మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి శిలాఫలకాన్ని వర్చువల్‌గా ఆవిష్కరించారు. అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవ చూపడంతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఇంజినీర్లను పంపడం, డీపీఆర్‌లను సిద్ధం చేయించడం, వంతెన నిర్మాణానికి, నదికి రెండు వైపులా ఘాట్‌రోడ్ల నిర్మాణానికి అనువైన స్థలాన్ని సేకరించడం వంటి పనులు చకచక జరిగాయి. కృష్ణానదిలో 14 ఫిల్లర్స్ వేసి వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు కావాల్సిన 13.35 ఎకరాల భూమిని సేకరించారు. పల్నాడు జిల్లా మాదిపాడు వైపు 4.45 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వైపు తొమ్మిది ఎకరాల భూమిని సేకరించారు. ముక్త్యాల వైపు మూడు కిలోమీటరు, మాదిపాడు వైపు అర కిలోమీటరు ఘాట్ రోడ్ వేసేందుకు ప్రతిపాదనలు చేశారు.



ఇంజినీర్లు తయారు చేసిన వంతెన నమూనా

టెండర్లు ఖరారు ఇలా...

2024, జనవరి 12 తుది గడువుతో నాలుగు టెండర్లు పిలిచిన అప్పటి ప్రభుత్వం కృష్ణానదిపై అచ్చంపేట మండల సరిహద్దులోని మాదిపాడు నుంచి, ముక్త్యాల సరిహద్దు వరకు కృష్ణానదిలో 14 ఫిల్లర్లు వేసి 600 మీటర్ల పొడవు, 12 మీటర్లు వెడల్పుతో వంతెన నిర్మించేందుకు టెండర్లు ఆహ్వానించింది. నాలుగు టెండర్లు రాగా, ఒక టెండరు ఖరారుచేసి పనులు ప్రారంభించే సమయంలో అంటే 2024 ఏప్రిల్ 18న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైంది. ఆ వెంటనే కోడ్ అమలులోకి రావడంతో వంతెన నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది.

పడకేసిన పనులు

వైఎస్సార్ సీపీ అధికారాన్ని కోల్పోవడంతో వంతెన నిర్మాణ పనులు పడకేశాయి. గెలిచిన ఆనందంలో కృష్ణానదిపై వంతెన నిర్మాణం కొనసాగిస్తామంటూ ఆర్భాటం చేసిన నియోజకవర్గ బాధ్యులు ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవడంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక సాకారం అయ్యే పరిస్థితులు కనిపించడంలేదు.

ఆ ఇద్దరిపై చర్యలేవీ!?

- సహానా హత్య కేసులో నిందితుడి స్నేహితుల పాత్రపై అనుమానం
- ఆస్పత్రిలో నవీన్‌తోపాటు ఇద్దరిని చూశానన్న సహానా తల్లి
- ఫిర్యాదులో ఉన్నా అరెస్టు సందర్భంలో లేని స్నేహితుల ప్రస్తావన
- రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

తెనాలి రూరల్: రౌడీషీటర్ రాగి నవీన్ చేసిన అమానుష దాడిలో బ్రెయిన్ డెడ్ అయి మరణించిన సహానా కేసు విచారణలో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితుడితోపాటు అతని స్నేహితులపై చర్యలు తీసుకోకపోవడం వీరి అనుమానాలకు ప్రధాన కారణం. ఈనెల 19న సహానాను నవీన్ తన కారులో సాయంత్రం 6.20 గంటల ప్రాంతంలో తీసుకెళ్లి తెనాలి మండలం కఠెవరం నుంచి ఎరుకలపూడి వెళ్లే మార్గంలో ఆమెపై దాడిచేశాడు. సహానా వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆమెను తెనాలి ఆర్టీసీ బస్టాండ్ వెనుకనున్న ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు అందుబాటులో లేరని చెప్పడంతో సహానా తల్లి అరుణకుమారికి ఫోన్‌చేసి విషయం చెప్పి, ప్రకాశం రోడ్డులోని మరో వైద్యశాలకు తన ఇద్దరు స్నేహితులతో కలిసి తీసుకెళ్లాడు. అక్కడకు సహానా తల్లి రాగానే ముగ్గురూ జారుకున్నారు. ఇక పోలీసులకు అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదులో నవీన్, అతని స్నేహితుల ప్రస్తావన ఉంది. కానీ, 22న సాయంత్రం మీడియాకు నవీన్ అరెస్టు విషయాన్ని పోలీసులు వెల్లడించిన సందర్భంలో నిందితుడి స్నేహితుల ప్రస్తావనలేదు.

దర్యాప్తు 'సాగు..తోందంట'!

సహానా హత్య కేసులో రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరపడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు వంగా సాంబిరెడ్డికి నవీన్ ప్రధాన అనుచరుడిగా ఉన్నాడు. చంద్రబాబు సమక్షంలోనే టీడీపీలో చేరాడు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడిగా మొన్నటి ఎన్నికల్లో చురుగ్గా పనిచేశాడు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే కేసు దర్యాప్తు సరిగ్గా జరగడంలేదని సహానా కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. నవీన్‌తో పాటు ఉన్న ఇద్దరు స్నేహితులను దత్తు, సుమంత్‌లుగా పోలీసులు గుర్తించినా వారిపై చర్యల్లేవు. కేసు పురోగతిపై టూటౌన్ సీఐ నిసార్ బాషాను వివరణ కోరగా.. ఇంకా పూర్తిస్థాయిలో విచారించాల్సి ఉందని పేర్కొన్నారు.



సహానాను ఆస్పత్రిలోకి మోసుకెళ్తున్న నవీన్, పక్కన స్నేహితుడు



క్లుప్తంగా

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నవంబర్ 2 నుంచి కార్తికమాసాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్తిక మాసంలో రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పంచారామాలను దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సామర్లకోట, అమరావతి, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వీటితో పాటు త్రిశైవ క్షేత్రాల దర్శనం యాగంటి, శ్రీశైలం, మహానంది ఆలయాలను ఒకే రోజు దర్శించుకునేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి శనివారం, ఆదివారం బస్సులను పంపేందుకు ఆర్టీసీ ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.. గుంటూరు రీజియన్ పరిధిలో ఐదు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, కార్తిక పౌర్ణమి రోజు అమరావతికి ప్రతి 15 నిముషాలకు ఒక బస్సును తిప్పనున్నామని తెలిపారు.

ఇతర రాష్ట్రాల టూర్లకు ట్యాక్స్ మినహాయింపు

కర్ణాటక, తమిళనాడు, కేరళ టూర్‌కు ట్యాక్స్ మినహాయింపుతోపాటు, శబరిమలకు ఆరు రోజులు, 8 రోజులు, 12 రోజుల టూర్ ప్యాకేజీలను అతి తక్కువ ధర లతో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు. గుంటూరు డిపోల నుండి త్రిశైవ క్షేత్రానికి ఎక్స్‌ప్రెస్ ఒక్కొక్కరికి రూ.1080, అల్ట్రాడీలక్స్ అయితే 1,380, సూపర్ లగ్జరీ అయితే రూ.1,440గా చార్జి నిర్ణయించామని పేర్కొన్నారు. గుంటూరు నుంచి పంచారామాల దర్శనం కోసం ఎక్స్‌ప్రెస్ రూ.870, అల్ట్రాడీలక్స్ 1,110, లగ్జరీ 1,160 చార్జి ఉంటుందని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం గుంటూరు డిపో 1, 2 నంబర్లు 9959225420, 9959225421తోపాటు, తెనాలి డిపో వారు 9959225422, మంగళగిరి డిపో వారు 9959225424, పొన్నూరు డిపో వారు 9959225267ను సంప్రదించాలని సూచించారు.

బాణసంచా దుకాణాలకు

ముందస్తు అనుమతి తప్పనిసరి

- నిబంధనలకు లోబడి నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి
- భద్రతపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ గనోరే


కలెక్టరేట్‌లో దీపావళిపై అధికారులతో సమీక్ష చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్ గనోరే

నరసరావుపేట: ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ బాణసంచా దుకాణం నిర్వహించకూడదని, నిబంధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈనెల 31న నిర్వహించుకునే దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు అంశాలపై ఆర్డీవోలు, ఫైర్, మున్సిపల్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేయాలని వినియోగదారులకు సూచించారు. ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిబంధనల మేరకు షాపులు ఏర్పాటు చేస్తున్నారా లేదా అని రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. షాపులు ఏర్పాటు చేసిన ప్రాంతంలో వాహనాల పార్కింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీఓలు వారంలోగా అన్ని బాణసంచా తయారీ గోడౌన్లను, స్టాళ్లను పరిశీలించి అనుమతులు ఉన్నవాటికి పర్మిషన్లు, పర్మిషన్ ముగిసిన స్టాళ్లకు రెన్యువల్ చేయించే చర్యలు చేపట్టాలన్నారు. తమ పరిధిలో లైసెన్స్ ఇచ్చే ముందు షాపుల వారితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు ఇవ్వాలని ఆర్డీవోలకు సూచించారు. అందుకు సంబంధించి విధివిధానాలను ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ టపాసుల విక్రయ దుకాణదారులు సురక్షితమైన జాగ్రత్తలు తీసుకోనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తప్పకుండా పాటించాలన్నారు. ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందంగా, ఆహ్లాదకరంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఆర్డీఓలు, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడలు

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సురేష్

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 29, 30తేదీలలో వివిధ క్రీడాంశాలలో జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఆయా తేదీలలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, రెజ్లింగ్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, స్విమ్మింగ్ తదితర క్రీడలలో ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోగులు తమ కార్యాలయ గుర్తింపుకార్డు, ఇతర ధృవపత్రాలతో 29వ తేదీ ఉదయం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం వద్ద హాజరు కావాలని తెలిపారు. ఆయా క్రీడాంశాలలో ఎంపికైన వారు నవంబరు 6 నుంచి 9వ తేది వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 8712622574 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

శిశు విక్రయాలపై కొనసాగుతున్న విచారణ

- ఒక చిన్నారిని రక్షణలోకి తీసుకున్న అధికారులు
- విక్రయానికి గురైన మరో ముగ్గురి కోసం గాలింపు
- అత్యంత గోప్యంగా విచారిస్తున్న ఉన్నతాధికారులు
- రాకెట్‌లో సూత్రదారుల కోసం ప్రత్యేక బృందం

నరసరావుపేట టౌన్: ఆకాశరామన్న ఉత్తరంతో వెలుగులోకి వచ్చిన శిశు అక్రమ విక్రయాల రాకెట్ విచారణ గోప్యంగా కొనసాగుతున్నది. ఇప్పటికే విక్రయానికి గురైన ఒక చిన్నారిని గుర్తించిన అధికారులు మరో ముగ్గురు చిన్నారుల ఆచూకీ కోసం విచారణ తీవ్రతరం చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా విచారణ అంశాలను బయటకు వెల్లడించటం లేదు. వివరాల్లోకి వెళితే.. పనసతోట ప్రాంతంలో నివాసం ఉంటున్న ఒక మహిళ గతంలో ప్రైవేటు వైద్యశాలలో ఆయాగా పనిచేస్తూ తనకు ఉన్న పరిచయాలతో శిశు విక్రయాలకు పాల్పడుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఆకాశరామన్న ఉత్తరం అందినట్టు తెలిసింది. లేఖలో శిశు విక్రయాలలో దళారి పాత్ర పోషించిన మహిళతో పాటు క్రయ, విక్రయాలకు పాల్పడ్డ పేర్లు ఉన్నట్టు సమాచారం. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టాలని శిశు సంక్షేమశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన సీడీపీఓ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త, సచివాలయ సిబ్బంది బృందంగా ఏర్పడి ఆకాశరామన్న ఉత్తరంలో పేర్కొన్న పనసతోట ప్రాంతంలో విచారణ చేపట్టారు. విచారణ చేస్తున్న సమయంలో ఆ ప్రాంత టీడీపీ నాయకులు అధికారులను అడ్డుకున్నారు. నేరారోపణ ఎదుర్కొంటున్న వారు తమ పార్టీ కార్యకర్తలనీ, వారి జోలికి వస్తే ఊరుకునేది లేదంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో వెనుదిరిగిన సిబ్బంది విషయాన్ని శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆ శాఖ అధికారులు జిల్లా ఎస్పీని కలసి శిశు విక్రయాలపై తమను జిల్లా కలెక్టర్ ఆదేశించిన విషయాలను వివరించారు. దీనిపై ఎస్పీ స్పందించి అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో టీమ్‌ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు. రంగంలోకి దిగిన మహిళా పోలీస్‌స్టేషన్ పోలీసులు కొంతమందిని అదుపులోకి తీసుకొన్నారు. విచారణలో శిశు విక్రయాలు జరిగినట్టుగా నిర్ధారించినట్టు తెలియవచ్చింది. దళారి ఇచ్చిన సమాచారంతో ఒక శిశువును తమ ఆధీనంలోకి తీసుకొని శిశు సంరక్షణ కార్యాలయానికి తరలించారు. విజయవాడలో ఒక బాలుడు ఉన్నట్టు తెలిసి శుక్రవారం అక్కడికి వెళ్లారు. మిగిలిన మరో ఇద్దరు చిన్నారుల కోసం విచారణ తీవ్రతరం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణను అత్యంత గోప్యంగా కొనసాగిస్తున్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

నలుగురు అరెస్టు, ఒక వ్యక్తి పరారీ


స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు

పిడుగురాళ్ల: అక్రమంగా తరలిస్తున్న పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకొని, వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు. పట్టణంలోని పిడుగురాళ్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐ వివరాలు వెల్లడించారు. ఈనెల 18వ తేదీన హైదరాబాద్ నుంచి కేతరాజు అంజయ్య అక్రమంగా ఓ మినీ వ్యాన్‌లో ఐదు బాక్స్‌ల్లో 200 జిలిటెన్‌స్టిక్స్ తరలిస్తున్న సమాచారం మేరకు అదుపులోకి తీసుకొని విచారించారు. దాచేపల్లి పట్టణంలో పేలుడు పదార్థాల లైసెన్స్ కలిగిన వెన్నా రాజశేఖర్‌రెడ్డి, నల్గొండ జిల్లా మిర్యాలగూడెంకు చెందిన ఆసీఫ్ తీసుకొని రామన్నారని తెలిపాడు. దామచర్ల గ్రామంలోని మల్లేష్‌కి కూడా ఈ పేలుడు పదార్థాలను అమ్మాడు. ఆ వ్యక్తి జనసంచారం ఉన్న ప్రాంతంలో ఇంటిలోనే పెట్టుకొని అమ్మకాలు చేస్తున్నాడని గుర్తించి ఆ వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. ఈ కేసులో ఐదుగురు పాత్ర ఉండగా వెన్నా రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని ఆ వ్యక్తిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. మిగిలిన వారిని అరెస్టు చేయటం జరిగిందని, త్వరలోనే కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారులు ఎంపిక


రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయిలో జరిగే రెజ్లింగ్(కుస్తీ) పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గుడిపూడి భూషణం మాట్లాడుతూ పురుషులు, స్త్రీల విభాగాలలో ఎంపికలు జరిగాయన్నారు.

పురుషుల విభాగంలో.... కె.లాలూనాయక్, ఆర్.శ్రీహరి, ఎం.దయాకర్, ఎస్.సుధాకర్, ఎన్.సత్యనారాయణనాయక్, ఆర్.పుల్లయ్య, వై.వంశీ, జి.కరుణ్‌కుమార్, కె.కిరణ్‌కుమార్, జి.మరియరాజు, వై.మల్లికార్జున, ఇ.రాజేష్, ఎం.పెదరాయుడు, బి.నరేంద్ర, ఎ.విజయకుమార్, పి.నాగరాజు, ఎం.రత్నకుమార్ ఎంపికైనట్లు చెప్పారు.

స్త్రీల విభాగంలో... ఆర్.ప్రమీలాభాయ్, పి.అఖిల, పి.ధనుకుభాయ్, ఆర్.దేవయాని, జి.నితిషా, వై.స్మృతి తదితరులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమార్, అధ్యాపకులు అభినందించారు. ఎంపికైన క్రీడాకారులంతా నవంబర్ 9,10 తేదీలలో అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గంలో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ జట్లు తరపున పాల్గొంటారని చెప్పారు.

ఆ బార్ అండ్ రెస్టారెంట్లను మూయించండి

స్వపక్షంపైనే ఫిర్యాదు చేసిన టీడీపీ వర్గీయులు


మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రంతో టీడీపీ, జనసేన నాయకులు

నరసరావుపేట: పట్టణంలో మద్యం షాపుల కేటాయింపు వివాదం తెలుగుదేశం పార్టీలోని రెండు వర్గాల మధ్య ముదిరి పాకాన పడింది. ఎమ్మెల్యే వర్గీయులు, వ్యతిరేక వర్గీయులుగా చీలి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. తాజాగా పట్టణంలో మున్సిపల్ స్థలాలను ఆక్రమించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారంటూ టీడీపీ, జనసేన వర్గీయులకు చెందిన పలు బార్ అండ్ రెస్టారెంట్లపై యల్లమంద గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కడియాల తాండవకృష్ణ తన పార్టీ, జనసేన నాయకులతో కలిసి శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుకు ఫిర్యాదు చేశారు. వినుకొండరోడ్డులోని శ్రీనివాస, ఆర్కే, జీవనజ్యోతి, నవయుగ బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు మున్సిపల్ స్థలాలను ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారని, ఈ బార్లలో మద్యం తాగిన వ్యక్తులు రాత్రి సమయంలో రోడ్లపైకి వచ్చి దారినపోయే వారిపై దాడులకు పాల్పడుతున్నారని, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. వెంటనే వీటిని మూసేయించాలని కోరారు.

దేవతా వృక్ష సౌందర్యం..



స్థానిక పల్నాటి వీరుల గుడి ఆవరణలోనిది ఈ దృశ్యం. రావి చెట్టు మొదలు నుంచి వేప చెట్టు పెరిగింది. వేప చెట్టుకంటూ ప్రత్యేకంగా వేరు వ్యవస్థ లేదు, పర్యావరణానికి మానవ మనుగడకు ఎంతో అపురూపమైన రెండు చెట్లు కూడా ఇలా కలసి పెరుగుతున్నాయి. రెండూ కూడా దేవతా వృక్షాలే. ఇలాంటి దృశ్యమే కారెంపూడి ఆర్ అండ్‌బీ బంగ్లా వద్ద ఉంది. అక్కడ దురిసెన చెట్టు మొదట్లో నుంచి రావి చెట్టు మానుగా ఎదుగుతోంది.

కారెంపూడి

ఏఎన్‌యూలో ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ పర్యటన


వీసీ గంగాధరరావు, ఉన్నతాధికారులతో సమావేశమైన ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల బృందం

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎన్ఐఆర్ఎఫ్(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) నిపుణుల బృందం పర్యటన శుక్రవారం ప్రారంభమైంది. కమిటీలో న్యూఢిల్లీ జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ జుబేదా అన్సారి, హైదరాబాద్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, మాజీ సీనియర్ నాక్ అడ్వైజర్ డాక్టర్ రమా కొండపల్లి, కోయంబత్తూర్ అమృత విశ్వ విద్యాపీఠం ఐక్యూఏసీ విభాగాధిపతి డాక్టర్ ప్రశాంత్ ఆర్.నాయర్ ఉన్నారు. బృందానికి ఉపకులపతి కె.గంగాధరరావు, రిజిస్ట్రార్ జి.సింహాచలం సాదర స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సమావేశ మందిరంలో యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్, అకడమిక్ డీన్లు, అధికారులతో కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. సమావేశంలో వర్సిటీ ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణ సత్య, ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపికృష్ణ, వర్సిటీ ర్యాంకింగ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. రవి యూనివర్సిటీ సమగ్ర నివేదికను బృందానికి సమర్పించారు. అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్, ఇన్నోవేషన్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ సెల్, సోలార్ సిస్టం, బ్యాటరీ వెహికల్, సేంద్రియ వ్యవసాయం, బొటానికల్ గార్డెన్, కమ్యూనిటీ రేడియో, యూనివర్సిటీ ముద్రిస్తున్న జర్నల్స్, ఇప్పటివరకు యూనివర్సిటీ సాధించిన అంతర్జాతీయ, జాతీయ, ర్యాంకులు, గేట్ , ఐఏఎస్, యూజీసీ నెట్ కోర్సులకు ఉచితంగా అందిస్తున్న శిక్షణ వివరాలను వెల్లడించారు. యూనివర్సిటీ బలోపేతానికి కావలసిన సలహాలు, సూచనలు ఇవ్వాలని నిపుణుల బృందాన్ని కోరారు. నివేదికలు పరిశీలించిన నిపుణుల బృందం యూనివర్సిటీలో విద్యార్థుల ప్రవేశాలు, ఉత్తీర్ణత శాతం, ఉద్యోగాల కల్పన, పరిశోధన ప్రవేశాలు, వాటికి తగినట్లుగా అధ్యాపకుల నియామకాలు, అధ్యాపకులకు కల్పించే పదోన్నతులు, విద్యార్థులకు అందిస్తున్న మౌలిక వసతులు క్షుణ్ణంగా పరిశీలించి తగు సలహాలు ఇచ్చారు. వీసీ గంగాధరరావు కమిటీ సభ్యులతో మాట్లాడుతూ ఏఎన్‌యూ అత్యుత్తమైన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు సాధించేందుకు దోహదం చేసే అంశాలపై సూచనలు చేయాలని కోరారు. దానికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె రామ్మోహనరావు, ఏఎన్‌యూ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉన్నతాధికారులు, డీన్‌లు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్
- ముగిసిన కాశ్మీరీ యువ సమ్మేళనం


సమ్మేళనంలో సర్టిఫికెట్లు అందుకున్న వారితో అతిథులు

ఏఎన్‌యూ(గుంటూరు): దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, గుంటూరు ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఆరురోజుల పాటు జరిగిన నాలుగో కాశ్మీరీ యువ సమ్మేళనం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యకలాపాలు, నైపుణ్య అభివృద్ధి, విద్య, ఉపాధికి దోహదం చేసే అంశాలపై యువత దృష్టి సారించాలన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో సాంకేతిక, పారిశ్రామిక పురోగతిని కాశ్మీర్ యువతకు పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఏఎన్‌యూ వీసీ గంగాధరావు మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో భాగమైన వివిధ అంశాలపై కార్యశాలలు, క్షేత్ర స్థాయి సందర్శనల ద్వారా కాశ్మీరీ యువతకు జాతీయ ఐక్యత, సమగ్రత వంటి అంశాలపై లోతైన అవగాహన కలుగుతుందన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎంపికైన నెహ్రూ యువకేంద్రాలలో గత నాలుగు సంవత్సరాలుగా కాశ్మీరీ యువ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి అన్ని శాఖల ప్రతినిధులు సహకరించారన్నారు. ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య దివ్యతేజో మూర్తి, విశాఖపట్నం జిల్లా, నెహ్రూ యువ కేంద్ర అధికారి జి మహేశ్వరరావు, చిత్తూర్ జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారి ప్రదీప్ బెహరా పాల్గొన్నారు. కార్యక్రమంలో కాశ్మీర్‌లోని పుల్వామా, బుద్గామ్, శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా, అనంతనాగ్ జిల్లాల నుంచి 132 మంది యువతీ యువకులు సమ్మేళనానికి హాజరయ్యారు. వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

యార్డులో 34,380 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,233 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,380 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 18,914 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మేలు

విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ నాగభూషణం


ఆధునిక విధానంలో పండిస్తున్న పంటను పరిశీలిస్తున్న డాక్టర్ నాగభూషణం

తెనాలి: రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు ఎంతో ప్రయోజనమని వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ పి.నాగభూషణం అభిప్రాయపడ్డారు. కొల్లిపరలోని శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని శుక్రవారం ఆయన తన బృందంతో కలిసి సందర్శించారు. సంఘానికి గల కలెక్షన్ సెంటర్‌ను కోల్డ్ స్టోరేజిని, పంటపొలాల్లో భూసారం తెలుసుకునేందుకు వినియోగిస్తున్న ఆధునిక పరికరాలను ఆయన పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం పనితీరును, రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమష్టిగా అమలుచేస్తున్న వ్యవసాయ విధానాలు, ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న తీరును ఆయన అభినందించారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ టి.రమేష్ బాబు ఉన్నారు.